


# జనన బీభత్సం..మరణ సౌందర్యం

## రాంనివాస్ ఎన్‌క్లేవ్ సెల్లార్‌లో

'పుట్టినపుడు స్పృహ లేదు.

మరణిస్తున్నపుడు ఎలాగూ స్పృహ ఉండదు.

కనీసం ఈమధ్యకాలంలోనైనా మనిషి స్పృహతో జీవిస్తే ఎంతబాగుండు–'

కొద్దిరోజులక్రితమే అనారోగ్య కారణాలపై విఆర్ఎస్ పొంది.. ప్రస్తుతం చీకటిగా ఉన్న సెల్లార్‌లో ఓ దిక్కుమాలిన మంచంపై అచేతనంగా, సజీవంగా పడిఉన్న మాజీ పోలీస్ ఎస్పీ అబ్రహాం లింకన్ మదిలో ఎక్కడో ఓ కవిత్వ పుస్తకంలో చదివిన పై వాక్యాలు పదే పదే జ్ఞాపకమొస్తూ వెంటాడుతున్నాయి.

స్పృహ...స్పృహ–

మనిషి స్పృహతో జీవించడం ఎంత గొప్ప విషయం.

తను స్పృహతోనే జీవించాడా ఎప్పుడైనా...

జీవితమంతా పరుగే... ఒకటే పరుగు. ఎడతెగని పరుగు... ఎడతెరిపిలేని పరుగు.

డబ్బుకోసం..సుఖాలకోసం, ప్రమోషన్లకోసం, సంపాదించిన డబ్బును, నగలను, భూములను బినామీగా, సురక్షితంగా ఎలా దాయాలో ఆలోచిస్తూ.. రేయింబవళ్ళు..అధికార దాహం నరనరానా పాకుతూండగా తలపై నిక్కి నిలబడ్డ కళ్ళతో ఖాకీ బట్టలవెనుక ఘనీభవించిన రాక్షసత్వం మూర్తీభవించి... పరుగు పరుగు... ఒకటే నిర్విరామ పరుగు.

పరుగులో ఉన్నప్పుడు విచక్షణ ఉండదు.

విచక్షణ లేనపుడు వివేకం నశిస్తుంది.

వివేకం లేనివాడు పశువై..రాక్షసుడై... విధ్వంసకారుడై.,

ఎందుకో లింకన్ హృదయం సముద్రమై ఉవ్వెత్తున కంపించింది. కన్నీళ్ళు గంగలా పొంగి జలజలా కార్తున్నాయి. కన్నీళ్ళు... ఆగని కన్నీళ్ళు... వెచ్చగా, నిప్పుల ప్రవాహంవలె..ధారలు ధారలుగా,

తనలో కన్నీళ్ళుకూడా ఉన్నాయా.

తనూ దుఃఖించగలడా..ఆశ్చర్యమేసింది లింకన్‌కు.

కాని..ఎవరు తుడుస్తారు తన కన్నీళ్ళను..తుడిచేవాళ్ళెవరున్నారు తనకు..,

ముగ్గురు పెళ్ళాలు, ఐదుగురు పిల్లలు, ఆర్గురు తోబుట్టువులు..ఎంతో బలగం..అందరూ ఉండి..ఎవరూ లేక...

'మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే..' అని కదా అన్నాడు మార్క్స్... ఎంత పచ్చినిజం.

మళ్ళీ కవి కవితా పంక్తులు స్ఫురించాయి లింకన్‌కు.

'కన్ను తెరిస్తే ప్రపంచంలో నువ్వు..

కన్ను మూస్తే నీలోనే ఒక ప్రపంచం.'

అవును కదా..కన్ను తెరిస్తే నీకుచెందని నీదికాని ప్రపంచంలో నువ్వు.. కన్నుమూస్తే నీకు మాత్రమే చెందిన నీదే ఐన ప్రపంచంలో నువ్వు.

ఎన్నో ప్రపంచాలు..మనిషి లోపలా, బయట.

రెండ్రోజుల క్రితం లింకన్‌కు పక్షపాతమొచ్చి మాటపడిపోయింది. కాళ్ళు పడిపోయాయి. చేతులూ పడిపోయాయి. చెవులు పనిచేస్తున్నాయి. చూపు ఉంది. మనిషి ప్రాణమున్న శవమైపోయాడు.

లోపల చిత్రంగా... జ్వలిస్తూ ఒక ఆత్మ,

అంటుకుని మండుతున్న అడవిలో గర్జిస్తున్న సింహంలా... ఒక హృదయం

అచేతనంగా ఉన్న లింకన్ ముఖంపై ఐదారు దోమలు వాలి కుట్టడం ప్రారంభించాయి. ఏడెనిమిది ఈగలుకూడా ముఖంపై ముసుర్తూ, వాల్తూ, లేస్తూ

గింగుర్లుకొడ్తున్నాయి. దోమలు కుద్తుంటే సూదులు గుచ్చుతున్నట్టు నొప్పి. ఈగల రొద అసహ్యంగా..చేయితో వాటిని పారద్రోలితే బాగుండు.

కాని...చేతులేవి...కదలక చచ్చుబడిపోయిన చేతులు...కదలని కాళ్ళు.. కదలని శరీరం.

ఇలా జరుగుతుందని ఊహించాడా తనెప్పుడైనా.

తనను తెచ్చి..ఈ చీకటికూపంలో..సెల్లార్‌లో..పాతసామాన్లు, డబ్బాలు, పనికిరాని విరిగిన ఫర్నీచర్ పడేసిన ఈ నేలమాళిగలో...పడేసి...అక్కరకురాని సామాన్లలో తనూ ఒక "త్రోఔట్".

ఒక వేయీ యాభై గజాల వైశాల్యమున్న..జూబ్లీహిల్స్‌వంటి ఎంతో విలువైన ప్రాంతంలో..సకల సౌకర్యాలతో రెండు అత్యంతాధునికమైన రెండు డ్యూప్లెక్స్ ఇండ్లు కట్టి తన ఇద్దరు పెళ్ళాలు..జననికి..సీతకు..చెరొకటి ఇచ్చి.. ఎన్ని సదుపాయాలు..ఎన్నిహంగులు..ఎంత ఆర్భాటం..

ముట్టుకుంటే మాసిపోతాయా అనిపించే గోడలు..నడిస్తే మచ్చబడిపోతుందేమోననిపించే ఫ్లోరింగ్..ఎటుచూచినా కురిసే వెన్నెల... ఆకుపచ్చని హరితస్వర్గం..ఒక దేవలోక సోయగం.

ఒకప్పుడు..ఇద్దరూ రంభా ఊర్వశులను తలదన్నే సౌందర్యవతులైన తన పెళ్ళాలు..

చక్రవర్తులు శత్రురాజులపై యుద్ధాలుచేసి జయించి, విజయచిహ్నంగా రాకుమార్తెలను వెంటతోడ్కొని వచ్చి పెళ్ళాడినట్టు...తను డిఎస్పీగా, అడిషనల్ ఎస్పీగా ఉన్నప్పుడు..రక్తం నరనరాల్లో పాదరసంలా ఉరకలు వేస్తున్నప్పుడు.. ఒకసారి జననిని..మరోసారి సీతను వివిధ సందర్భాల్లో తెచ్చుకుని..కొన్నాళ్ళు ఉంచుకుని...పోనీలే అని పోలీస్ అహంకార సంస్కృతిలో భాగంగా పెళ్ళిచేసుకున్నట్టు నటించి.,

ఎవడో ఓ కార్పొరేట్ 'కింగ్' ఏదో మర్డర్‌కేసులో ఇరుక్కున్నవాన్ని తప్పించినందుకు లంచంగా...జూబ్లీహిల్స్‌లో ఈ జాగ..ఈ బంగళాలు..

ఒకదాంట్లో జనని..మరొకదాంట్లో సీత...రెంటికీ కలిపి కామన్ గేట్.. గేట్‌ముందు ఆర్డర్లీ పోలీస్‌లు కాపలా.

బాస్ ఉంచుకున్న ముండల లంగాలు ఉతికేందుకూ, బ్రాలు పిండేందుకూ, ఇండ్లు కడిగేందుకు, కుక్కలను ఆడించేందుకు కానిస్టేబుల్స్ వినియోగం..బ్రిటిష్‌వాడి బానిస సంస్కృతి..అధికారికంగా–

ఉండి ఉండి...చటుక్కున లింకన్‌కు మూత్రం చొచ్చుకొస్తున్న ఫీలింగ్ కలిగింది...అసలే డయాబెటిక్..ఉచ్చ ఆగడం లేదు...దాంతోపాటుగా దొడ్డిక్కూడా వస్తోందా..?

ఇప్పుడు తనేంజేయాలి.?

అరుస్తే..ఎవర్నయినా పిలిస్తే..కాని మాటరాదు..నోరు పడిపోయి.. దేవుడా..

చేతులు కదలవు..కాళ్ళు కదలవు..ఎవరూలేరు ప్రక్కన..

తలను త్రిప్పి కళ్ళను బలవంతంగా చుట్టూతిప్పి గమనించాడు..మనిషి అలికిడే లేదు.

ఉహు..ఇక లాభంలేదు..మూత్రం ఆగడంలేదు. ఆపుకోవడం వశం కావడంలేదు..

జుంయ్‌య్..ర్ర్ర్...

ప్యాంట్ తడుస్తోంది..ముందునుండి మూత్రం..వెనుకనుండి దొడ్డికి.. అయ్యో..ఏమిటీ పరిస్థితి

ఎస్పీగా ఉన్నపుడు...లింకన్ ఈజ లయన్..అవినీతిపరుడైన, లంచగొండియైన, ఈ సమాజాన్నీ, దేశాన్నీ దోచుకు తినే లింకన్ అంటే సింహం... లింకనంటే హడల్.

తన భారీ విగ్రహం జ్ఞాపకమొచ్చింది లింకన్‌కు. ఖాకీ యూనిఫాం.. భుజాలపై నక్షత్రాలు..గుబురు మీసాలు..క్రూరమైన చింతనిప్పుల కళ్ళు... చీకటిపడకముందే ప్రారంభమయ్యే మందు విందు..అందమైన ఆడవాళ్ళ పొందు.

ఎంతమంది ఆడవాళ్ళు...ప్చ్...ఎవడు లెక్కపెట్టాడు...ఎన్ని హోటళ్ళలో టిఫిన్ చేశావంటే ఎవడు చెప్పగలడు..అలాగే అంతమంది ఆడవాళ్ళు..,

'ధనమెక్కిన మదమెక్కును, మదమెక్కిన మత్సరంబు మరి మరి ఎక్కున్'

కాళ్ళు నేలపై ఉన్నాయా...కాళ్ళు ఆకాశంలో కదా ఉన్నాయ్..చూపులు 360$^0$ డిగ్రీల వర్తులంలో 'అధికార కాలంనందు చూడవలె అయ్యగారి వయ్యారముల్'

మెల్లగా దుర్వాసన..వాసన తెరలు తెరలుగా..పొగలుపొగలుగా వ్యాపిస్తోంది.

ఉచ్ఛ్వాసన..పీతివాసన..కంపు..పరమకంపు..భరించలేని దుర్వాసన.

శ్లేష్మంలో ఈగ..కొట్టుకో కొట్టుకో..సాలెగూటిలో పురుగు. తన్నుకో తన్నుకో.,

ముఖంపై గుంపులు గుంపులుగా దోమలు..కుప్పలు కుప్పలుగా ఈగలు.

కదలికలేని మనిషి నిస్సహాయత తెలిసింది వాటికి..దాడి చేస్తున్నాయి.

సెట్‌బ్యాక్..రిట్రీట్..హైడ్..అడ్వాన్స్ అండ్ ఫైర్...

లింకన్‌కు తన చేతినేదో కుద్తున్నట్టనిపించింది..స్పర్శలేదు..కాని ఏదో పాక్షికమైన అనుభూతి...ఏదో ప్రాకుతున్నట్టు..ఏదోపైన పారుతున్నట్టు..

కదలని శరీరంలో..ఒక్క కదిలే కనుగ్రుడ్లను కిందికి..ఊడి బయటికొస్తాయా అన్నంత బలంగా కిందికి రిక్కించి చూశాడు..ఎర్రచీమల దండు..చేతిని, నడుమును..ఛాతీదాకా...కొరుకుతూ, పైకి ఎగబ్రాకుతూ...

కుప్పలు కుప్పలుగా చీమలు.. మెలమెల్లగా శరీరమంతా వ్యాపిస్తూ..

ప్రాణముండగానే మనిషి చీమలు పట్టి, ఈగలు ముసిరి...దోమలు ఎగబడి కుడ్తూ...ఏమిటీ గతి?

"అరేయ్ లంజకొడ్కా..మా ఉసురు తాక్తదిరా నీకు...పురుగులు పడి చస్తవ్.." అని ముప్పయ్యేళ్ళ క్రితం..తను సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్నపుడు..ఆ ఆపిల్‌పండు వంటి గుడిసెవాసురాలు యువతిని తీస్కొచ్చి పోలీస్‌స్టేషన్‌లో తను రేప్ చేసిన మర్నాడు ఆమె చనిపోతే..శవాన్ని ముందుపెట్టుకుని గుండెలవిసేలా ఏడ్చిన ఆ ఎముకలగూడువంటి మాతృమూర్తి ముఖం, కళ్ళముందు కదిలింది. ఎక్కడో అట్టడుగు పొరల్లోపల దాక్కునిఉన్న లావావంటి అగ్నిఏదో విరజిమ్మి భగ్గున కాల్చివేస్తున్నట్లనిపించింది..ఒళ్ళు జలదరించి భయం క్రమ్మేసింది.

పాపపుణ్యాలు..కర్మఫలితాలు.."యత్‌భావం తత్ భవతి"..నీ బుద్దెంతో నీకు బువ్వంత..

..ఇవన్నీ ఉంటాయా...

చటుక్కున లింకన్‌కు ఓ జ్ఞాపకం తుపాకీ గుండులా వచ్చి తగిలింది

సిఐ..ప్రమోషన్ వచ్చిన కొత్తరోజులవి..డిపార్ట్‌మెంట్ కొత్త రివాల్వర్‌ను పంపించిందా రోజే. దాన్ని చేతిలోకి తీసుకున్నప్పుడల్లా ఒకటే తీట...ఎవర్నయినా కాల్చిచంపితే బాగుండునని..ఒకటే ఆరని హత్యాచాపల్యం...హింసాకాంక్ష.

ఆరోజే.. ఉదయం వస్తున్నపుడు చూశాడు తను...తన మూడేళ్ళ చిన్నకూతురు ఏంజలినా..ఒక బొద్దింకను వెల్లగిలా పడేసి చీపురుపుల్లతో గుచ్చుతూ అది తల్లడిల్లుతూంటే తను కేరింతలు కొడ్తోంది..తర్వాత గార్డెన్‌లో పట్టుకున్న తూనీగను రెక్కలు పీకేసి...తోకను తుంచి...గలగలా నవ్వుతూ ఆనందపడ్తోంది... ఏమిటీ పైశాచికానందం.

మనిషి అంతరాంతరంగంలో హింసను పిచ్చిగా ఆనందించే రాక్షస ప్రవృత్తి ఉంటుందా.

మనిషి వయసు పెరుగుతున్నకొద్దీ ఈ హింసాతృష్ణ గుప్తమై దాగి దాగి.. అప్పుడప్పుడు పెళ్ళుబుకుతూ,

ఆ రివాల్వర్ వచ్చిన రోజు..జీప్‌లో ఓ పాతకేడీని కావాలని ఎక్కించుకుని ఊరిబయటికి తీస్కెళ్ళి...విడిచిపెట్టి...పారిపోతున్నవాన్ని కొత్త రివాల్వర్‌తో కాల్చి... కోరిక తీర్చుకుని..చుట్టూ ఎర్రగా రక్తపు మడుగు...ఛాతీ చిట్లి వీపుభాగమంతా నుజ్జునుజ్జయి..

మనసునిండా పిచ్చి ఆనందం..తృప్తి...ఆశ్చర్యపోయాడు తనారోజు.. తనలో ఇంత పైశాచికవాంఛ దాక్కుని ఉందా అని..మృగత్వం...హింసాదాహం.. రక్తపిపాస..ఎందుకు?

తర్వాత్తర్వాత..ఎన్ని హత్యలో...ఎన్ని రేప్‌లో..ఎన్ని ఎన్‌కౌంటర్లో..ఎన్ని లాకప్ హింసలో. ఇంటరాగేషన్‌లో నేరస్థులను తీవ్రంగా కొడ్తూ, థర్డ్ డిగ్రీ చేస్తున్నప్పుడల్లా పిచ్చి ఆనందం...పిచ్చి తృప్తి...పిచ్చి పరవశం.

చటుక్కున అబ్రహాంలింకన్‌కు స్టెల్లా జ్ఞాపకమొచ్చింది..

## 2

### కలకత్తా 'నిర్మల్ హృదయ్' ఆవరణలో

బయట కుండపోతగా వర్షం.

ఉదయం ఐదుగంటలు.

యాభైరెండు సంవత్సరాల మేరీస్టెల్లా తన ముందున్న రెండు దృశ్యాలను తదేకంగా చూస్తోంది.

ఒక పర్ణశాలవంటి తన రెండు గదుల ఇంటి అరుగుపై కూర్చుని ఉందామె. ఆమె ముందు ఒక గంప...గంప నిండా గడ్డి...గడ్డిపై తను సరిగ్గా ఇరవైఒక్క రోజుల క్రితం పొదగబెట్టిన కోడిపెట్ట....కొక్కుపట్టిన మాతృమూర్తి... ఇంకొక అరగంటలో గ్రుడ్లు పిల్లలుగా మారుతూ..పెంకును ధ్వంసించుకుని, పై ముక్కుతో కవచాన్ని చీల్చుకుని..

ఒక కొత్త జన్మ.,

యాధృచ్ఛికమే..కాని. ఎదుట అరుగు అవతల మామిడిచెట్టుకింద తను ప్రియంగా 'రాణీ' అని పిలిచే ఆవు..తొమ్మిది నెలలూ మోసీ మోసీ..మరో అరగంటలో దూడను ప్రసవించబోతోంది. తల్లి గర్భాన్ని చీల్చుకుని..ఒక నిర్ణీత కాలావధి పూర్తవగానే..ఒక కొత్త జీవి...కొత్త జన్మ...ఒక కొత్త జీవావిష్కారం..

జన్మ...అది కోడిపిల్లదైనా...దూడదైనా..మానవ శిశువుదైనా...ఒక బీభత్స మథనం. ఒక పెనుగులాట..ఒక విముక్తత...ఒక తీవ్ర ఘర్షణ...అంతిమంగా ఒక జీవవిస్ఫోటనం...

జననం ఎప్పుడూ బీభత్సమే...ఎవరికి..?

జన్మనిచ్చే తల్లికా...జన్మను పొందుతున్న శిశువుకా.? ఏమో..ప్చ్.

బీజంలోనుండి మొలక నేలను చీల్చుకుని తలెత్తుకోవడం నిశ్శబ్ద బీభత్సమే.

ప్రతి జంతుకూనా 'మాయి'ని చీల్చుకుని ఈ భూమిపై ప్రభవించడం... ఒక భౌతిక బీభత్సమే

వర్షం కురిసినా, అగ్ని నక్షత్రాలు మెరిసినా, ప్రతి సూర్యోదయం విప్లవించినా...అవన్నీ మౌన బీభత్సాలే..,

స్టెల్లా చూస్తూండగానే...గంపలోని తల్లి కోడి రెక్కలసందుల్లోంచి ఒక చిరుకోడిపిల్ల తలను బయటికిపెట్టి కదలి..ముక్కును సాచి...ఒక వింత కదలిక..

కొత్త జీవి ఈ జీవావరణలోకి ప్రవేశిస్తూ మొట్టమొదట ఈ గాలిని తాకి.. పంచభూతాలతో మమేకమౌతూ ఈ సృష్టితో అనుసంధానమౌతున్న ప్రత్యక్ష జీవక్రియ.

సరిగ్గా...అదే సమయానికి.. చెట్టుకింది ఆవు...ఒక భీకరమైన శబ్దంతో ప్రసవ వేదనపడ్తూ...గింజుకుంటూ...'మాయి' బయటపడింది.

చటుక్కున నేలపైకి..ఒక పువ్వు రాలిపడ్డట్టు..తెల్లని దూడ...

జననం...ఒక చిత్రం...ఒక నిత్యవింత...ఒక నిరంతర ఆశ్చర్యం.. ఒక అనంత చిత్రం

ఒక జీవి...అది పక్షయినా, పశువైనా..మొలకైనా..ఇంత అంతర్ మథనంతో, అంతర్ ప్రళయంతో జన్మించి..భగవత్ దత్తమైన జీవితాన్ని ఎంత అర్ధవంతంగా జీవిస్తున్నట్టు.

దేనికదే స్వేచ్ఛాజీవియైన పశుపక్ష్యాదులు వాటి పరిమితుల్లో అవి ప్రకృతి సిద్ధాంతాలకు లోబడి జీవిస్తాండగా..వ్యవస్థీకృతమైన సంఘజీవిగా బాధ్యతాయుతంగా బతుకవలసిన మనిషి ఎంత ధర్మబద్ధంగా, ప్రకృతి నియమంగా తన జీవితాన్ని కొనసాగిస్తున్నాడు..?

సృష్టిలో ఒక్క మనిషి తప్ప ఏ జీవైనా తనకు కావలసినదానికంటే ఎక్కువ సంపాదించి దాచుకుంటోందా..

మనిషి మాత్రం అనేకానేక కారణాలతో కరుడుగట్టిన స్వార్థజీవిగా, అవినీతిపరుడుగా, దోపిడీదారుగా, దురాక్రమణదారుడుగా, అనైతికవర్తనుడుగా ఎందుకు మారిపోతున్నాడు. మూలమైన సృష్టిధర్మాన్ని ఎందుకు ఉల్లంఘిస్తున్నాడు.

ఆ విషయాన్నే అడిగింది స్టెల్లా తన భర్త అబ్రహాంలింకన్‌ను.

నాల్గు సంవత్సరాలు అతనితో కాపురం చేసి...అతని దుష్ప్రవర్తనను మార్చాలని ప్రయత్నం చేసీ చేసీ...అతని విచ్చలవిడితనాన్నీ, లంచగొండితనాన్నీ, క్రూరమైన ఖాకీ ప్రవర్తననూ పరివర్తించాలని ఎంతో ఓపిగ్గా కృషి చేసీ చేసీ... ఉహుఁ.,

ఓడిపోయింది తను.

అతను మారడని స్పష్టంగా తేలిపోయింది.

ఆ కాపురంలో...అతను పెడ్తున్న తిండి రక్తపుకూడులా, అతను ఇస్తున్న డబ్బు కన్నీళ్ళధారలుగా, అతని కర్కశత్వం హూంకరిస్తున్న పశుఘీంకారంగా, అతనితో దాంపత్యం సర్పపరిష్వంగంలా...

రెండేళ్ళ 'ఏంజలినా'ను వెంట తీసుకుని విడిపోయింది తను లింకన్‌తో. విడిపోయి కలకత్తా వచ్చి 'మథర్ థెరిసా' నిర్మల్ హృదయ్‌లో చేరింది.

పోలీసాఫీసర్ లింకన్‌తో తెగతెంపులు చేసుకున్నరోజు..ఎంత ఆనందమో...

ఒక పాములపుట్టలో నుండి బయటపడ్డట్టు, నిప్పుల కొలిమిలోనుండి ఇవతలికొచ్చినట్టు..

విముక్తమైంది..ఒక జీవిత పరమార్థ అన్వేషణలో, సార్థకతను సాధించే క్రమంలో..శాశ్వత ఆత్మానందాన్ని ప్రోగుచేసుకునే ప్రయత్నంలో...

మిగతా జీవితమంతా..ఆనందమయమే.

'ఏంజలినా'ను పెంచి పెద్దజేయడం, చదివించడం, ఒక మంచి పౌరురాలిని నిర్మించడం.,

ఎందరో కుష్టురోగులకు, వికలాంగులకు, అనాథలకు సేవచేయడం...

స్టెల్లా కుర్చీలో చేరగిలబడి...చూస్తోంది...ఎదుట ఎర్రగా ఉదయిస్తున్న సూర్యుణ్ణి..ఎక్కడో తనను తాను కోల్పోయిందామె.

ఆమెకు తెలియకుండానే...అప్పటికే కోళ్ళగంప నిండా ఎన్నో చిన్న కోడిపిల్లలు కిచకిచలాడ్తున్నాయి.

ఎదుట దూడ..మెల్లిగా లేచి నిల్చుంది..ఒంటినిండా జిగురుతో... సేవకురాలు 'మాల' దూడను గుడ్డతో తుడుస్తోంది.

స్టెల్లాకు లింకన్ జ్ఞాపకమొచ్చాడు...ఒక్కసారిగా అసహ్యమేసింది.

వెన్వెంటనే ..గతవారమే ఎమ్మెస్ పూర్తిచేసుకుని లండన్ నుండి అమెరికా వెళ్ళిన తన కూతురు ఏంజలినా నవ్వు గుర్తొచ్చింది.

హృదయం నిండా కాంతి...తెల్లగా, నిర్మలంగా...ప్రశాంతంగా.

ఏదో తృప్తి.

## 3

లింకన్‌కు దుఃఖం ముంచుకొచ్చింది...కళ్ళనిండా, హృదయంనిండా, సమస్త శరీర అంగాంగాలనిండా కన్నీళ్ళే..

రొచ్చు మంచంలో..గుడ్డివెలుతురు చీకటిలో..ఉచ్చలో, అశుద్ధంలో, ఈగలు, దోమలు ముసుర్తూండగా..

అసహ్యమేసింది...తనపై తనకు...మొదటిసారిగా..

ఇప్పుడెలా?...

చచ్చిపోతే ఎంత బాగుండును.

కాని ఎలా చనిపోగలడు తను.

జన్మ రమ్మంటే వచ్చిందా...మరణమూ రమ్మంటే వస్తుందా..?

లింకన్‌కు తన తాత ఇమ్మాన్యుయేల్ జ్ఞాపకమొచ్చాడు. చిన్నపుడు చెబ్తుండేవాడు తాత...'మృత్యువుదేవత అమ్మవంటిదిరా లింకన్. అప్పుడే అడుగులేస్తున్న పసిపిల్లవాణ్ణి తల్లి చేతులు చాచి ఎలా పిలుస్తుందో చూశావా... అలా పిలుస్తుంది ఆప్యాయంగా మనిషిని వాడికి మృత్యువు ఆసన్నం కాగానే. తల్లి పిలుస్తే పోకుండా ఏ పసివాడైనా ఉండగలడా. మనిషీ అంతే, అమ్మవంటి

మృత్యుదేవత పిలుస్తున్నపుడు పోకుండా తప్పించుకోవడం ఎవడితరమూ కాదు..'

మృత్యువు...దేవత..అమ్మ...కరుణామయి - తనను రారమ్మని పిలుస్తే ఎంత బాగుండును. తొందరగా తనను తన అక్కున చేర్చుకుని ఈ కుళ్ళుకంపునుండి విముక్తం చేస్తే ఎంత బాగుండును. ఈ దుఃఖభూయిష్టమైన ప్రపంచంనుండి, రోగ బంధురమైన ఈ శరీరంనుండి, దుర్మార్గమైన వ్యాపార సంబంధాలతో అల్లుకుపోయిన భవబంధాలనుండి..ఈ డబ్బు, ఈ సంపదలు, ఈ ఆస్తులు, వీటన్నింటినుండి విడివడి...ఎగిరే పక్షివలె,...ఫ్రై లిబరేట్,

వెంటనే ఏవేవోబ్యాంక్ లాకర్లలో దాచిన వేయి రూపాయల నోట్లకట్టలు, ఎక్కడెక్కడో రహస్యంగా ఉంచిన కిలోలకొద్దీ బంగారునగలు, ఇద్దరు వేశ్యలవంటి పెళ్ళాలకు ఎంతో డబ్బు, ఆస్తి ఏర్పాటుచేసినా...యింకా వాళ్ళకు తెలియకుండా తనకుమాత్రమే తెలిసిన భూముల డాక్యుమెంట్ల వివరాలు, బినామీ కాగితాలు, వివిధ బ్యాంక్ అకౌంట్లలో లక్షలకొద్దీ డబ్బు, వాటి ఎటిఎం కార్డ్స్, వాటి పాస్‌వర్డ్స్..,

అన్నీ కలిపితే ఏ యాభై కోట్లో.

వీళ్ళకిచ్చిన జాగ, ఇండ్లు ఏ పదికోట్లో...యితర ఉంపుడుగత్తెలకు యిచ్చిన ఆస్తులు ఏ పదిరవై కోట్లో.

యిన్ని కోట్ల రూపాయల ఆస్తులు ఎక్కడివి తనకు.

అవినీతి...అవినీతి..దోపిడి...దోపిడి...

అందరికి చెందవలసిన సామాజిక సంపద ఏ కొందరో సంఘద్రోహుల చేతుల్లో చిక్కిపోయి..

అటు కొండ...ఇటు లోయ.

అటు నిండిన కడుపులు...ఇటు ఆకలి డొక్కలు.

కమండలంలో బందీయైపోయిన సముద్రం విముక్తం కావాలి...ఎలా... ఎలా..నలభై ఎనిమిదేండ్ల జనని జ్ఞాపకమొచ్చింది లింకన్‌కు-

ముగ్గురాడపిల్లలు...ఇద్దరు ఎవరెవరితోనో లేచిపోయారు. ఒక్కతి యిప్పుడు 'ఫ్యాషన్ డిజైన్' చదువుతోంది అమెరికాలో.

సీత జ్ఞాపకమొచ్చింది..నలభై రెండేళ్ళ సీత.

సీతకు పిల్లలు లేరు.

పొద్దున లేస్తే క్లబ్బులు..పబ్‌లు..టూర్‌లు...ఎవరితో తిరుగుతుందో.. ఎవడి దగ్గర పడుకుంటుందో..ఏం చేస్తూంటుందో తెలియదు. తన 'పోలీస్ పవర్'ను వాడుకుని ప్రపంచాన్ని హడలగొడ్తూంటుంది.

ఒకే ఆవరణతో ఉన్నా జనని, సీత...ఎప్పుడూ యిద్దరు మాట్లాడుకోరు.

ఎంతమంచి పేర్లు...జనని..అంతే తల్లి...సీత...పరమసాధ్వి.

లింకన్‌కు అసహ్యమేసింది...వాళ్ళతో తను సంబంధం పెట్టుకుని,

అనివార్యమై పెళ్ళిచేసుకుని, వాళ్ళను జన్నెకిడిచిన ఆవుల్లా వదలి.,

అసలు ద్రోహి తను.. తనను శిక్షించాలి...తనను ఉరితీయాలి...తనను ముక్కలు ముక్కలుగా ఎకె ఫార్టీసెవెన్‌తో తూట్లు తూట్లుగా షూట్ చెయ్యాలి నిజానికి..

కాని ...ఎవరు చేస్తారు.

ఎవరు తనకు 'మృత్యువు'ను ప్రసాదిస్తారు.

ఎంత ఆక్రందించినా అందని 'మృత్యువు' నిజంగా ఎంత సౌందర్యవంతమైంది.

కావాలన్నపుడు అందనిది...అదమరిచి ఉన్నపుడు సింహంలా పైకి లంఘించి కబళించేది..

అసలు..'మరణం' సౌందర్యవంతమైందా.?

అలసి, డస్సి, చివికి..శిథిలమై ఐచ్ఛికంగా మనిషి తనంతట తానుగా మృత్యుకాంక్షను వెలిబుచ్చే మరణచాపల్యం సౌందర్యవంతమైందా.

ఎప్పుడో ఒకప్పుడు మనిషి మరణాన్ని కూడా స్వాగతించడం తప్పదా? మరణంకోసం తపించడం తప్పదా?

లింకన్ కళ్ళు అశ్రువులను కారుస్తోనే ఉన్నాయి.

దుఃఖం సముద్రమై పొంగుతూనే ఉంది.

అకస్మాత్తుగా అతనికి తన మొలత్రాడుకు కట్టి ఉన్న చిన్న తాళం చెవి సంగతి జ్ఞాపకమొచ్చింది. ఆ తాళంచెవితో తన ఎస్‌బిఐ లాకర్‌ను తెరిస్తే దాంట్లో రెండు పేజీల మ్యాటర్..పన్నెండు బ్యాంకుల లాకర్ నెంబర్లు..వివరాలు..ఒక కాగితంపై పది పాస్‌వర్డ్స్, పది ఎటిఎం కార్డులు...అంతా కలిసి...పదిహేను కోట్ల విలువగల ఆస్తి...నగదు, నగల వివరాలు.

కాని ఆ తాళంచెవి తన దగ్గరున్నట్టు ఎవరికైనా ఎలా తెలుస్తుంది,

తనెవ్వరికీ చెప్పలేదు ఇంతవరకూ...తామంతట తాము ఎవరికైనా తెలుసుకోవడం కష్టమే..జనని, సీత...ఆరోజు తను చేసిన విచిత్రమైన ఏర్పాటు ...జోకర్ పేకముక్కలు...

జ్ఞాపకమొచ్చి నవ్వొచ్చింది లింకన్‌కు..వెంటనే దుఃఖం ఉప్పెనలా ముంచుకొచ్చింది.

సరిగ్గా....అప్పుడే..

ఆ ఇద్దరూ ప్రవేశించారు సెల్లార్‌లోకి...జనని...సీత.

ఇద్దరూ లింకన్ మంచానికి అటొకరు, ఇటొకరు నిలబడి...చెరొక జోకర్ బొమ్మున్న పేకాట కార్డు ముక్కను బయటికి తీశారు. ఒకరి కార్డుపై 'మొల' అని రాసి ఉంటే మరొకరి కార్డుపై 'త్రాడు' అని ఉంది...కలిపితే 'మొలత్రాడు' ఐంది.

హమ్మయ్య...తెలిసింది వీళ్ళకు...అంటే యిద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకుని ఒకటైతే తప్ప., ఈ మొలత్రాడు రహస్యం...కోడ్ తెలియదు.

లింకన్ ముఖం వికసించింది.

ఇక ఈ డబ్బు గబ్బు పోతుంది తననుండి..హమ్మయ్య.,

జనని లింకన్ నుండి వస్తున్న దుర్వాసనకు ముక్కు మూసుకుంటూ ప్యాంట్ గుండీలు తెరిచి మొలత్రాడును వెదికింది. సీత వెంట తెచ్చిన కత్తితో దాన్ని కోసి తాళం చెవిని తీసుకుంది. తీసుకుని 'అక్కా...ఎస్‌బిఐ, అంబర్‌పేట నంబర్ పదహారు' అంది..తాళంచెవిని చదువుతూ.

'ఓకే...కానీ పని' అంది జనని.

'మిస్టర్ లింకన్...యిక నీకు విముక్తిని ప్రసాదిస్తున్నాం...ప్రభువును తల్చుకో' అంది సీత.

లింకన్ కళ్ళు మూసుకున్నాడు.

సీత కదలలేని జీవచ్ఛవంలా ఉన్న లింకన్ ముఖంపై దిండును పెట్టి శ్వాస ఆడకుండా గట్టిగా అదిమి..క్షణాల్లో లింకన్ ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

మరణమెంత మధురమో లింకన్ ఆత్మకు అర్థమైంది.

## 4

'నా బ్లాక్‌కొచ్చి టీ తాగి వెళ్ళరాదక్కా' అంది సీత సెల్లార్ మెట్లెక్కుతూ జననినుద్దేశించి.

జనని 'పిచ్చిదానా'...అన్నట్లు నిర్లక్ష్యంగా సీతవైపు చూచి..'పద' అంది.

ఐదు నిముషాల తర్వాత స్వర్గధామంలా ఉన్న డ్యూప్లెక్స్ ఇంటి హాల్‌లో కూర్చుని ఉంది జనని. జనని, తాము ఒకే పురుషునికి చెందీ ఎన్నడూ సీతా, తనూ మాట్లాడుకోని తమ విచిత్రమైన సంబంధం గురించి ఆలోచిస్తూ అసూయ కలిగించే ఆ ఇంటి పరిసరాలను గమనిస్తోంది.

లోపలినుండి సీత రెండు టీ కప్పులతో వచ్చి టీపాయ్‌పై పెడ్తూ "ఈ తాళంచెవి నీదగ్గరే ఉంచక్కా...ఈయన తతంగమంతా ముగిసింతర్వాత విచారిద్దాం ఏంచేయాలో అంది"..టీపాయ్‌పై కప్పులతో పాటు లాకర్ కీ ఉంది.

"నువ్వుంచుకున్నా ఫర్వాలేదు సీతా..." అంది జనని.

"నువ్వు వేరు నేనువేరు కాదక్కా. నీదగ్గరే ఉండనీ...టీ తీసుకోండి.. ఈయన శవాన్ని ఎలా డిస్పోజ్ చేయాలో విచారిద్దాం" అంది.

"నువ్వు స్నానం చేసి పావుగంట తర్వాత మా ఇంటికి రా...పకడ్బందీగా ప్లాన్ తయారుచేద్దాం"

"సరే.."

ఐదు నిముషాల్లో టీ తాగడం పూర్తయి...జనని సోఫాపైనుండి లేస్తూ "వెళ్ళొస్తా సీతా" అని భుజంపై చేయివేసి కౌగిలించుకుంది ఆప్యాయంగా.

అప్పుడు జననికి విశాలమైన, అందమైన, సెక్సీగాఉన్న సీత వీపు కనబడింది

సరిగ్గా అప్పుడే సీతకు తన వీపుపై ఏదో గుండుసూదివంటి పదునైన మొన గుచ్చుకున్నట్టనిపించి.. ఉలిక్కిపడి... తేరుకుని.,

"మంచిదక్కా" అంది సీత.

జనని చకచకా వెళ్ళిపోయింది కిందికి మెట్లుదిగి.

* * *

పది నిముషాల తర్వాత జనని మళ్ళీ సీత డ్యూప్లెక్స్ ఇంటికొచ్చింది. తను ఊహించినట్టుగానే తన సైనైడ్ ట్రీట్‌మెంట్ వల్ల సీత సోఫాలో మరణించి... ఒరిగిపోయి... నిద్రిస్తున్నట్టుగా పడి ఉంది.

జనని నిశ్శబ్దంగా టీపాయ్‌పైనున్న బ్యాంక్ లాకర్ తాళంచెవిని జాగ్రత్తగా తీసుకుని, తన చీరకొంగుతో పరిసరాలన్నింటినీ వేలిముద్రలు లేకుండా తుడిచి ఏమీ జరుగనట్టు ప్రశాంతంగా బయటికి నడిచింది... పదికోట్ల విలువగల లాకర్ కీ అది.

ఎందుకో ఆమెకాక్షణం సెల్లార్‌లో దయనీయంగా చచ్చిపడిఉన్న సోకాల్డ్ తన మొగుడు, మాజీ ఎస్పీ అబ్రహం లింకన్ జ్ఞాపకమొచ్చాడు. జాలేసింది. కన్నీళ్ళు కూడా వచ్చాయి అనూహ్యంగా.

రెండురోజుల తర్వాత,

'రిటైర్డ్ ఎస్పీ లింకన్ మరణాన్ని జీర్ణించుకోలేని ఆయన భార్య సీత ఆత్మత్యాగం' అన్న వార్త అన్ని ప్రముఖ దినపత్రికల్లో వచ్చింది.

పదేళ్ళ తర్వాత...

బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడ్తూ...అచేతనంగా మంచంపై పడిఉన్న డెబ్బయ్‌కోట్ల ఆస్తికి వారసురాలు జనని ఎంతో ఆశగా, అతురతగా...దుఃఖంతో మృత్యువుకోసం ఎదురుచూస్తోంది.

కాని...

ఏది మృత్యువు..?

పిలిచినపుడు రాదది. రావలసినపుడే తప్పక వస్తుంది...తల్లిలా.

మదర్ నోస్ వెన్ టు ఫీడ్ ద చైల్డ్.